నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | నవంబర్ 16, 2024 | www.navatelangana.com

గుడుంబా పట్టివేత

నవతెలంగాణ-కౌటాల



ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 20లీటర్ల గుడుంబాను పట్టుకున్నామని ఎస్‌ఐ మధుకర్ తెలిపారు. చింతలమానేపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన జాటోత్ దేవ్‌సింగ్ ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా మండలంలోని గుడ్లబోరి, వైగాం సమీపంలో పట్టుకున్నామన్నారు. బైక్‌ను సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



పొలానికి వెళ్తూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన సొంకరి సురేష్‌కు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఫోన్‌ను పోలీసులు ట్రాప్ చేసి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సురేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చలి షురూ..!



- జిల్లాలో క్రమంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రాత్రి వేళలో చలి తీవ్రత మరింత అధికం
- తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగ మంచు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, వృద్ధులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అనూహ్య వాతావరణ మార్పులకు నెలవు. ఎప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో తెలియని పరిస్థితి. ఇక్కడ అన్ని ఎక్కువే అంటారు. ఎండలు మండిపోవడం, అధిక వర్షాలు, అత్యల్ప స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోవడం వంటి వాతావరణ మార్పులు సంభవిస్తుంటాయి. తాజాగా చలి కాలం ప్రారంభం కాగానే ప్రతాపం చూపిస్తోంది. అప్పుడే గజగజ వణికిస్తుండగా.. డిసెంబర్, జనవరి నెలల్లో తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఎండకాలంలో 46డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తాజాగా 15డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలకు పడిపోవడం చూస్తే పరిస్థితి అర్థమవుతోంది. మైదాన ప్రాంతంలోనే ఈ స్థాయిలో ఉంటే అడవులు అధికంగా ఉండే ఏజెన్సీ ప్రాంతంలో మరింత ప్రభావం చూపుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత అంతకంతకు పెరిగిపోతుంది. అప్పుడే జనం వణికిపోవాల్సి వస్తోంది. రాత్రి వేళలో చలిమంటలు వేసుకొని ఉపశనం పొందాల్సి వస్తోంది. ప్రతి ఏటా చలి తీవ్రత కారణంగా మనుషులే కాకుండా పశుపక్ష్యాదులు సైతం ఇబ్బందులు పడుతున్న సందర్భాలుంటున్నాయి. తాజాగా 15డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో జనం అవస్థలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఉదయం వేళలో మరింత తీవ్రంగా ఉండటంతో తెల్లవారుజాము నుంచే పనిలో దిగే పల్లెవాసులు, చిరువ్యాపారులు, కూరగాయలు, పాల వ్యాపారులు, పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి వరుసగా క్రమ క్రమంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రక్షణ కోసం వెచ్చగా ఉండే స్వెట్టర్లు వినియోగిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు జలుబు, దగ్గు, శ్వాస ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ పరిశుభ్రత కోసం ఉదయాన్నే పనిలో నిమగ్నమయ్యే పారిశుధ్య కార్మికుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఉదయాన్నే పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం 6గంటల నుంచే చలి తీవ్రత అధికమవడంతో వివిధ పనుల నిమిత్తం జిల్లా, మండల కేంద్రాలకు రాకపోకలు సాగించే వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు.



ఈ ఏడాది పరిస్థితి ఏంటో..?

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడం సాధారణంగా మారుతోంది. కిందటేడాది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, కౌటాల, సిర్పూర్(టి) మండలాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని అర్లి(టి), బేల మండలంలోని పలు గ్రామాలు, నిర్మల్ జిల్లాలోని తానూరు తదితర ప్రాంతాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 2018లో 2.7డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయిన సందర్భాలున్నాయి. మరుసటి ఏడాది 2019లో 4.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డిసెంబర్, జనవరి నెలల్లోనే ఈ చలి ప్రభావం అధికంగా ఉండనుంది. ప్రతి ఏటా కొన్ని రోజుల పాటు 10డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతుండటంతో మైదాన ప్రాంతాలతో పాటు ఏజెన్సీవాసులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రక్షణ కోసం చలి మంటలు వేసుకోవడం, వెచ్చని దుస్తులు ధరించడం వంటివి చేస్తున్నారు. ఈ ఏడాది సైతం అలాంటి పరిస్థితి ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

జాగ్రత్తలు తీసుకోవడమే మేలు : డా.సాయికృష్ణ, పల్మనాలాజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్, కన్సల్టెంట్ తిరుమల హాస్పిటల్



చలి నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఊపిరితిత్తులు, అస్తమా సమస్యలు ఉన్న వారికి శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వాతావరణం మార్పుల కారణంగా చిన్నారులు ఊపిరితిత్తుల సంబంధిత ఇన్‌ఫెక్షన్ల బారినపడుతుంటారు. వృద్ధుల్లో ముఖ్యంగా పొగ తాగేవారికి మరింత ఇబ్బందులు వస్తుంటాయి. చలి నుంచి రక్షణ పొందేందుకు వెచ్చని దుస్తులు ధరించడం, గోరువెచ్చని నీటిని తాగడం వంటివి చేయాలి. ముఖ్యంగా దుమ్ము దూళి వెళ్లకుండా ముక్కు, చెవులకు మాస్క్ వంటివి ధరించాలి. వృద్ధులు పొగతాగడాన్ని తగ్గిస్తే బాగుంటుంది.

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుకు పథకాల అమలు



నవతెలంగాణ-నిర్మల్

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం ధర్తీ ఆబా భగవాన్ బీర్సా ముండా 150వ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన గౌరవ దినోత్సవ సమారోహం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బీహార్ నుండి దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని జిల్లాల వారీగా గిరిజనులను ఉద్దేశించి మాట్లాడిన సందేశాన్ని దృశ్యమాలిక ద్వారా అధికారులు, గిరిజన ప్రజలు తిలకించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో మొదటి దశగా ఎంపికైన 33 ఆవాసాలను అభివృద్ధి పర్చే దిశగా అధికారులు ప్రాధాన్యతపరంగా పనులు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి, తాగునీరు, రహదారులు, అటవీ హక్కు చట్టం, విద్యుత్, వైద్య సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పథకాలను అమలు పరిచేందుకు బ్లాకులు, మండల స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ అధికారిని నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి చందన పథకం లక్ష్యాలు, అమలు తీరును వివరించారు. అంతకుముందు గిరిజన సాంప్రదాయ బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, వివిధ గ్రామాల గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

సంచార మెడికల్ యూనిట్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం బీర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని ప్రారంభించిన ప్రధానమంత్రి దర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన సంచార మెడికల్ యూనిట్‌ను కలెక్టర్ కుమార్ దీపక్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్‌తో కలిసి ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమంలో భాగంగా సంచార మెడికల్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నూతన పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా వేయి సంచార మెడికల్ యూనిట్లను ప్రారంభించడం జరిగిందని, ఈ క్రమంలో జిల్లాకు కేటాయించిన మెడికల్ యూనిట్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ యూనిట్ వాహనంలో వైద్యాధికారి, సిబ్బంది ఉంటారని, జిల్లాలోని 21 గిరిజన గ్రామాలలో ఈ వాహనం సంచరిస్తూ గిరిజనులకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, వైద్యాధికారి అనిల్, పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి, డిపిఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బొక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభ్యర్థులు పరీక్షకు సకాలంలో హాజరు కావాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో నవంబర్ 17, 18 తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పరీక్షకు 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 15038 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ఏసీపీ సుందర్, రీజియన్ కోఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డిలను నియమించామని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, శాఖ అధికారులు, ఐడెంటిటీ, బయోమెట్రిక్ వెరిఫికేషన్, రూట్, జాయింట్ రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 గంటలు, మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష కేంద్రానికి రావాలని, ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు(ఆధార్ కార్డు, పాస్ పోర్టు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ఒరిజినల్ ఫోటో ఐడెంటిటీ కార్డు), నలుపు, నీలం బాల్ పెన్నులు తెచ్చుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, పేజర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్, ఎనలాగ్/ డిజిటల్ గడియారాలు, బ్లూటూత్‌లను లోపలికి అనుమతించబడవని తెలిపారు.

సింగరేణి పరిరక్షణకు సంతకాల సేకరణ

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-మందమర్రి

బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించారు. శుక్రవారం మందమర్రి సీఈఆర్‌ఓ క్లబ్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భూమి, బొగ్గు, శ్రమ, ప్రాణం తమదైతే బీజేపీ, మోడీ పెత్తనం ఏంటని ప్రశ్నించారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కేటాయించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకునేందుకు నవంబర్ 18 నుండి సంతకాల సేకరణ ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రాంతంలో బతుకుదెరువు చూపిస్తున్న సింగరేణిపై పయివేటీకరణ కత్తి పెట్టిందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ ప్రభుత్వ ఆధీనంలో ఉండడం మూలంగానే మంచిర్యాల జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు అనేక కొత్త ప్రాంతాలు, బస్తీలు ఏర్పడి అభివృద్ధి జరిగిందని తెలిపారు. మరోపక్క పరిశ్రమలు రావడానికి సింగరేణి సంస్థ ప్రధాన కారణమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలు సింగరేణిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సంస్థగా



సింగరేణి నిలిచిందన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేసి లక్షలాది మందిని రోడ్డుపాలు చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సింగరేణి కేటాయించాల్సిన శ్రావణపల్లి బ్లాక్‌ను వేలం పాటలో పెట్టి ఆదానీ, అంబానీ చేతుల్లో పెట్టాలని చూస్తోందన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 18 నుంచి సంతకాల సేకరణ చేసి రాష్ట్ర గవర్నర్‌కు, కేంద్ర కార్మిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, ఐఆర్పిపి రాష్ట్ర నాయకులు జయరావ్, సింగరేణి ఉద్యోగ సంఘాల నాయకులు కనికరపు అశోక్, సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డుర్కే మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్, సోషలిస్టు పార్టీ (ఇండియా) జిల్లా అధ్యక్షులు కనకయ్య, లెదర్ ఫ్యాక్టరీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, బిఎస్‌పి చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల ప్రసాద్, చాట్లపెల్లి అనిల్, సింగరేణి సంరక్షణ సమితి నాయకులు మంతెన రాజశేఖర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మొయ్య రాంబాబు, పాత వీరస్వామి, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.మహేందర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- అగ్నికి ఆహుతైన పత్తి, నగదు, నిత్యావసర సరుకులు

నవతెలంగాణ-వాంకిడి



షార్ట్ సర్క్యూట్‌తో ఇందాని గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..చాప్లే ప్రకాష్ కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం ప్రమాదవశాత్తు ప్రకాష్ ఇంట్లో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే ఇంట్లో ఉన్న 30క్వింటాళ్ల పత్తి, నగదుతో పాటు నిత్యావసర సరుకులు, రెండు మేకపిల్లలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిలినట్టు బాధితుడు ప్రకాష్ తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

గ్రూప్-3 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలను నిర్వహించబోవు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో జరగబోవు గ్రూప్-3 పరీక్షలను ఎటువంటి లోటు పాట్లు లేకుండా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క ఇన్విజిలేటరు, ఇతర అధికారులు నిర్దేశించిన సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద భద్రత విధులు నిర్వహించబోవు సిబ్బంది ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించాలన్నారు. అభ్యర్థి గుర్తింపు కార్డులోని ఫొటోతో సహా ఇతర వివరాలను సరిచూసిన తర్వాతనే అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలన్నారు. పరీక్ష రాయబోవు అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష సమయంలో అభ్యర్థులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినట్టయితే ప్రథమ చికిత్స నిర్వహించడానికి వీలుగా అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రశ్నపత్రాలలు పరీక్ష కేంద్రాల్లోనికి తరలించే సమయంలో, పరీక్ష పూర్తయిన తర్వాత ఓఎంఆర్ పత్రాలు తరలించే సమయంలో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 24 పరీక్ష కేంద్రాల్లో 8,124 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించాలని తెలిపారు. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున 9.30 నిమిషాల తర్వాత ఏ ఒక్క అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించకూడదన్నారు. పరీక్ష నిర్వహణకు మొత్తం జిల్లాలో 24 మంది ముఖ్య పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, 24 మంది శాఖాధికారులు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 338 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 63 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించామన్నారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల్లోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలలోని పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాల్లోని మూసివేసి 144 సెక్షన్ ను అమలుపరచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, పరీక్షల కోఆర్డినేటర్ ఆర్జీ రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడువాలని, అపుడే మనసుకు ప్రశాంతత లభిస్తుందని మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం భీంపూర్ గ్రామంలో కార్తీక పూర్ణిమ కాగడ హారతి ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామంలోని జగదంబాదేవి మాత, సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్ మందిరంలో బోగ్ భండార్ పుజలు చేసి సంప్రదాయ బద్ధంగా గ్రామ ప్రజలతో కలిసి భజన కీర్తనలు చేస్తూ శోభయాత్రలో పాల్గొన్నారు. అదేవిధంగా గంగాపూర్, తాడిహత్నూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో కార్తీక మాసం పూర్తి సందర్భంగా హనుమాన్ మందిరంలో గ్రామ ప్రజలు కాగడ హారతి దహి హండి, కాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బాణోత్ గజానంద్ నాయక్, రాథోడ్ విష్ణు, ఉత్తం, రామేశ్వర్, ఆలయ కమిటీ చైర్మెన్ రాథోడ్ రమేష్, విలాస్, గ్రామ నాయక్ రాథోడ్ రాజు, జాధవ్ ప్రకాష్, రాక్రు నాయక్, డిగాంబర్ గ్రామ పెద్దలు ఉన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ



108 అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవించింది. మండలంలోని లచ్చింపూర్(కే) గ్రామానికి చెందిన దుర్గ అనే నిండు గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో 108 వాహనం ఆ గ్రామానికి చేరుకొని, గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం ఇంద్రవెల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు ఈఎంటీ సురేష్, పైలెట్ గోపీనాథ్ తెలిపారు.

బీర్సాముండా స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయం



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్రిటీష్ వలసవాదంపై తిరుగుబాటుగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన బిర్సాముండా స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శనీయమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం బీర్సాముండా జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్దగల బిర్సాముండా విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 22 ఏండ్ల వయస్సులోనే బ్రిటిష్ కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించి, బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించిన యోధుడు బీర్సాముండా అని గుర్తుచేశారు. అటు సిక్కు మతస్తుల ఆరాధ్య గురువు గురునానక్ జయంతి సందర్భంగా ప్రజలందరికీ గురునానక్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, ఎస్టీ సెల్ చైర్మెన్ ఆనంద్‌రావు, సంతోష్‌రావు, సిడాం రాంకిషన్, మెస్రం శంకర్, గెడం మాధవ్ పాల్గొన్నారు.

వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో...

బిర్సాముండా ఆదివాసుల కోసమే కాకుండా దేశ ప్రజలందరి పక్షాన బ్రిటీష్ వారితో పోరాడి చిన్నవయస్సులోనే ప్రాణత్యాగం చేశారని, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో జనజాతి గౌరవ దివాస్, భగవాన్ బిర్సాముండా జయంతి వేడుకలను ఎస్టీయూ భవనంలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆదివాసీ ఉద్యమాలను చిన్నచూపు చూశారని అన్నారు. ద్రౌపది ముర్ము లాంటి గిరిజన మహిళకి దేశ ప్రథమ పౌరురాలిగా రాష్ట్రపతిగా చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ఆదివాసీ విద్యార్థులు సంక్షేమం కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. దేశం మొత్తం ఆదివాసీ విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. ఆదిలాబాద్‌లో ఇప్పటి వరకు 300కి పైగా విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ వనవాసీ కళ్యాణ పరిషత్‌లో ఇచ్చినట్లు పేర్కొన్నారు.. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ డీవీ, ఎన్వీ శివకుమార్, వనవాసీ కళ్యాణ పరిషత్ తెలంగాణ కార్యదర్శి, ఆత్రం సతీష్, మెస్రం జంగు ఉన్నారు.

హీరాసుక ఆదివాసీ జాగృతి సమితి ఆధ్వర్యంలో ..

భగవాన్ బిర్సాముండా యుక్త వయసులోనే ఆదివాసుల హక్కుల కోసం పోరాటాలు చేశారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం బీర్సాముండా జయంతిని పురస్కరించుకొని హీరాసుక ఆదివాసీ జాగృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీర్సాముండా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. బీర్సముండా పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆదివాసి పోరాటయోధుల విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరాసుక జాగృతి సమితి అధ్యక్షుడు సిడం రామ్‌కిషన్, సమితి సభ్యులు, బీజేపీ నాయకులు అకుల ప్రవీణ్, రఘుపతి, శివ పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని సొనాల గ్రామంలో శుక్రవారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు



ఆదిలాబాద్‌టౌన్

బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, పూలే వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు గాజుల పోతన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్సా ముండా భారతదేశంలోనే మొట్టమొదట ఆదివాసీ తెగ నుంచి వారి హక్కుల కోసం బ్రిటిష్ వారితో యుద్ధం చేసిన గొప్ప వీరుడని అన్నారు. 420 మంది సైన్యాన్ని పోగుచేసి విల్లులు, బాణాలతో బ్రిటిష్ సైన్యంతో యుద్ధం చేసిన యుద్ధ వీరుడు బీర్సా ముండా అని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో ఆదివాసీ సమాజం ఐక్యంగా ఉంటూ తమ హక్కులను తమ సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అమృతరావు పాటిల్, కసిరే పోతన్న, అనిల్, భూమన్న, ఇస్రు పటేల్, శ్రీధర్, బాసెట్టి రమేష్, లోలపు పోశెట్టి, భోజన్న, లాలూ రామ్, భీమ్‌రావ్ పాటిల్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని బీజేపీ గిరిజన మోర్చా మండలశాఖ ఆధ్వర్యంలో జాతీయ గిరిజన గౌరవ దివస్ శ్రీ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శుక్రవారం బీజేపీ నాయకులు మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసీ ముద్దుబిడ్డ నాటి సమరంలో క్రిస్టియన్ మిషనరీ మతమార్పిడిలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాథోడ్ శేషారావు, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం హరిప్రసాద్, బీజేపీ జిల్లా కొండేరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, కార్యదర్శి. లింగాగౌడ్, సీనియర్ నాయకులు ఉష్కెముల్ల దేవిదాస్, జిల్లా సీనియర్ నాయకులు తన్నీరు సతీష్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్ పాల్గొన్నారు.



బోథ్

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధులు భగవాన్ బీర్సా ముండా జయంతిని ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ బీర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బలిరాం మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా బ్రిటిష్ ప్రభుత్వానికి పన్ను మాఫీ కోసం బ్రిటిష్ సైనికులతో యుద్ధం చేశారన్నారు. వారి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బంకట్ లాల్, పరశురామ్, దీప్‌సింగ్, రాజేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : సమాజం కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బిర్సాముండా అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మావల మండలంలోని కుమురంభీం కాలనీలో బిర్సాముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కుమురంభీం కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసులు ఉంటున్న కాలనీకి పట్టాలు ఇచ్చి వసతులు కల్పించాలన్నారు. సీతాకాలం అసెంబ్లీ సమావేశాల్లో మొట్టమొదటిగా కుమురంభీం కాలనీ సమస్యలపైనే మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం గణేష్, జిల్లా నాయకులు మనోజ్, బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రఘుపతి, జోగు రవి, బీమ్‌సేన్‌రెడ్డి, స్వామిరెడ్డి, సాయి, శివ, అశోక్‌రెడ్డి, జైపాల్, అడెల్లు, కుమురంభీం కాలనీవాసులు పాల్గొన్నారు.



ఉట్నూర్



ఆదిలాబాద్‌రూరల్

సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలేవాడ, కుమారి తండ గ్రామంలో శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వేపై కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఆత్రం గోవింద రావు, రవి, వెంకట్‌రావు, గుంజాల రమేష్, రాజలింగు, మురళీ, ఆశిష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేంజ్ అధికారికి జింక అప్పగింత



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గండి రాంపూర్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో జింకకు గాయాలయ్యాయి. అది గమనించిన ఆర్టీసీ బస్‌డ్రైవర్ సామల్, కండక్టర్ ఆర్ఎస్ రెడ్డి బస్సులో ఎక్కించుకొని సంబంధిత ఉడుంపూర్ ఫారెస్ట్ రెంజ్ అధికారి అనితకు అప్పగించారు. రేంజ్ అధికారి డ్రైవర్, కండక్టర్‌లను అభినందించారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సాజిద్‌ఖాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దిగ్రస్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేకు మద్దతుగా వీహెచ్ హనుమంతరావు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలవుతున్నాయని, మహారాష్ట్రలో కూడా మహా వికాస్ అగాడి కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఇక్కడ కూడా అన్ని రకాల సంక్షేమ పథకాల అమలు అవుతాయన్నారు. మాణిక్ రావు ఠాగూర్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మినాజ్, వసీం, మోతీరాం, మునీర్, రిజ్వాన్, అక్తర్, ముర్తుజా పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



నవతెలంగాణ-సిరికొండ

అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ అటవీ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ముందస్తు సమాచారంతో సిరికొండ మండల కేంద్రం నుంచి తాంసి మండలం గొట్కూరికి ఆటో నెంబర్ ఏపీ01 టీఏ 0120లో కలపను తరలిస్తున్నారనే సమాచారంతో గస్తీ నిర్వహించగా గౌరాపూర్ గ్రామ సమీపంలో ఆరు కలప దుంగలను తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ.60వేల వరకు ఉంటుందని తెలిపారు. అక్రమంగా కలపను తరలిస్తున్న నలుగురి నిందితులపై కేసులను నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ అటవీశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా కలప స్మగ్లింగ్‌కి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ రేంజ్ అధికారి కవిత, బీట్ అధికారులు సజన్‌లాల్, శ్యామ్‌సుందర్, డ్రైవర్ సాయి పాల్గొన్నారు.

రైల్వే బోర్డు సభ్యుడికి క్రీడా సంఘాల సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వే బోర్డు సభ్యులుగా నియమితులైన కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఉష్కం రఘుపతిని జిల్లా క్రీడా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా క్రీడా మండలి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా క్రీడా సంఘాల ప్రతినిధులు కే పార్థసారథి, జబాడే రాష్ట్రపాల్ మాట్లాడుతూ ఉష్కం రఘుపతికి పదవి రావడం క్రీడా సంఘాలకు దక్కిన గౌరవంగా క్రీడాకారులకు ఈరోజు సుదీనమని ఆదిలాబాద్ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రైల్వే శాఖ తరపున 75శాతం రాయితీ కల్పిస్తారని, అయితే ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి ఈ పాసులను పొందాల్సి ఉండటంతో చాలా ఇబ్బందులకు క్రీడాకారులు గురవుతున్నారని అన్నారు. అలాకాకుండా నాందేడ్ నుంచి ఈ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని అందుకు రఘుపతి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉష్కం రఘుపతి మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ముఖ్యంగా కబడ్డీ క్రీడాకారులకు చేయూతనిస్తానని పేర్కొన్నారు. క్రీడాకారుల రైల్వే రిజర్వేషన్ గురించి ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. తనను సన్మానించిన క్రీడా సంఘాల ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు దయానంద్‌రెడ్డి, రాజేష్, కాంతారావు, నాందేవ్, విఠల్‌రెడ్డి, రాము, జక్కుల శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

గ్రూప్-4లో మెరిసిన ఆణిముత్యాలు

- జిల్లాకు 167 మంది ఉద్యోగుల కేటాయింపు



ఖానాపూర్:తల్లిదండ్రులతో మాధురి, రక్షిత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, ఖానాపూర్

రెండు సంవత్సరాల నిరుద్యోగుల నిరీక్షణకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రూప్-4 ఫలితాలు వచ్చేశాయి. జిల్లాకు చెందిన యువతీ, యువకులు చిన్నవయసులోనే కొలువులను కొట్టేశారు. 2022 సంవత్సరం నోటిఫికేషన్‌కు సంబంధించిన గ్రూప్-4 ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ గురువారం విడుదల చేసింది. ప్రొవిజినల్ సెలెక్షన్ లిస్టును ప్రకటించిన టీజీపీఎస్సీ వాటి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఆదిలాబాద్ జిల్లాకు 42 మందిని వార్డు ఆఫీసర్లుగా, 118 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఏడుగురిని జూనియర్ అకౌంటెంట్లుగా కేటాయించింది. ఈ ఉద్యోగాలకు జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు సైతం ఎంపికయ్యారు. మొత్తం జిల్లాకు 167 మంది ఉద్యోగులుగా కేటాయించబడ్డారు. ఈ పోస్టులను భర్తీ చేసినట్లయితే జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీల సంఖ్య భర్తీ అయ్యే అవకాశముంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు ఎ.మాధురి, రక్షిత ఉద్యోగాలు సాధించారు. మాధురి ఎస్‌జీటి, రక్షిత గ్రూప్-4లో వార్డు ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు.

కొలువు కొట్టిన నిరుపేద యువకుడు



పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన భూమగౌడ్, పుష్పలత దంపతుల కుమారుడు సాయి తరుణ్‌గౌడ్ గ్రూప్-4 లో కొలువు సాధించాడు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో గట్టి ప్రయత్నం చేసి ఎట్టకేలకు కొలువు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయి తరుణ్‌గౌడ్‌కు ఉద్యోగం రావడం పట్ల కుటుంబానికి ఆర్థిక భరోసా ఏర్పడింది. దీంతో బంధుమిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కొలువు సాధించిన మహాలక్ష్మివాడ వాసి



జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన ప్రశాంత్ మ్యనవార్ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంటగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఏంఎన్సీ కంపెనీలో ఉద్యోగం చేస్తునే, ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువతో గ్రూప్స్ పరీక్షకు ప్రిపేర్ అయ్యాడు. ఎట్టకేలకు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబీకులు మిత్రులు అభినందలు తెలిపారు.

మొన్న టీచర్ ఉద్యోగం.. ఇప్పుడు గ్రూప్-4



పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన నెరేళ్ల రమేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు సాయికృష్ణ గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యారు. అయితే ఇటీవలే విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 12వ ర్యాంక్‌తో ఎస్జీటీగా కొలువు సాధించి ఉద్యోగం చేస్తున్నారు. అంతలోనే టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా కొలువు సాధించి, తన ప్రతిభను కనబర్చారు. దీంతో కుటుంబీకులు హర్షం వ్యక్తం చేయగా, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సెలవు పెట్టి..ఉద్యోగం కొట్టి..



ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంటకి చెందిన శ్యామ్‌రావ్, రేఖ బస్సి దంపతుల కుమార్తె ప్రీతి గ్రూప్-4 ఫలితాల్లో కొలువు సాధించింది. ఇదివరకే ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి, ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో జాయిన్ అయింది. గ్రూప్స్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో సెలవు పెట్టి ఉద్యోగానికి సన్నద్ధమైంది. ఎట్టకేలకు గ్రూప్-4 రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. దీంతో బంధుమిత్రులు ఆమెను అభినందించారు.

పేరెంట్స్ టైలరింగ్..కొడుకుకు మూడు ఉద్యోగాలు



ఉట్నూర్‌కు చెందిన రామగిరి శ్రీనివాస్, లలిత దంపతుల కుమారుడు సాయికుమార్ గ్రూప్-4లో వార్డు ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. 2018లో జరిగిన పోలీసు రిక్రూట్‌మెంట్‌లో తెలంగాణ స్పెషల్ పోలీస్‌గా ఎంపికయ్యారు. విధులు నిర్వహిస్తూ 2023లో జరిగిన పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ట్రైనింగ్‌లో ఉన్నారు. తల్లిదండ్రులు టైలరింగ్ వృత్తి చేస్తూ జీవనం గడుపుతున్నారు. కొడుకు మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి..ప్రభుత్వ ఉద్యోగం



పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన మోకిన పెల్లి మహేందర్ జూనియర్ అసిస్టెంట్ కొలువు సాధించారు. ఇచ్చోడ మైనారిటీ గురుకుల పాఠశాలలో సైన్స్ విభాగంలో పొరుగు సేవా సిబ్బందిలో టీజీటీ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్-4 ఫలితాలలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల తోటి స్నేహితులు ఇజ్జగిరి నవీన్ కుమార్, మోకిరాల మహేష్, ఏం.అశోక్, ఎన్.ప్రమోద్, పులిపాక నరేష్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | నవంబర్ 16, 2023 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి రౌతు వర్షిత రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పరమశివ తెలిపారు. ఈ నెల 14న మంచిర్యాల జిల్లా రెబ్బెనపల్లిలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలలో కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వర్షిత ఎంపికైనట్లు ఆయన వివరించారు. శనివారం మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయిలో ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు. వర్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్ అభినందించారు.

ఎల్లారం గ్రామస్తుల పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని ఎల్లారం గ్రామస్తులు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఎల్లారం గ్రామం నుంచి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు ఈ పాదయాత్రను చేపట్టారు. పాదయాత్ర అధ్యంతం భక్తి పాటలతో కొనసాగించారు. కేస్లాపూర్ ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేస్లాపూర్ ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు రూప్నర్ రమేష్, గుండా వెంకన్న బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, ఎల్లారం గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని శివకేశవ ఆలయం, హనుమాన్ మందిర్‌లో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుండే భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శివకేశవ ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె ప్రవీన్ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌటాల : మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో శుక్రవారం కార్థిక పౌర్ణమి సందర్భంగా ఆలయ పూజారి అంబేద శంకరయ్య సంతోష్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు శివుని దర్శనం కోసం భారీగా పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు క్యూ లైన్‌లో వెళ్లి శివుని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ పూజారి అంబేద శంకరయ్య సంతోష్‌లు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంకల్ప బలం ముందు ఓడిన వైకల్యం

- మూడు ఉద్యోగాలు సాధించిన అంధుడు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారని ఓ మహానుభావుడు చెప్పినట్లు సంకల్ప బలం ఉంటే ఎంతటి విజయమైన కాళ్ళ ముందుకు వస్తుందని జిల్లా కేంద్రానికి చెందిన అందుడు నిరూపించాడు. జిల్లా కేంద్రానికి చెందిన పుల్లారి రాహుల్ ఒకే సంవత్సరంలో మూడు ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శప్రాయుడుగా నిలిచాడు.


సంకల్ప బలం విజేతగా నిలిపింది

చిన్నప్పటినుండి అందత్వంతో బాధపడుతూ మిగతా పిల్లల వలె ఆడుకోలేక వారితో కలవలేక బాధపడుతూ జీవితంలో ఏదైనా సాధించాలని పట్టుదలతో జిల్లా కేంద్రానికి చెందిన పుల్లారు రాహుల్ సహాయకుడి సహాయంతో తల్లిదండ్రుల ప్రోత్సలంతో చదువుపై దృష్టి పెట్టాడు. దీనితో సంకల్ప బలం ఆయనను విజయతీరాలకు చేర్చింది.

అంధుడైన ఆదర్శప్రాయుడే

పుట్టుకతో అంధత్వంతో బాధపడినప్పటికీ దానిని పక్కనపెట్టి లక్ష్యం వైపు దృష్టి కేంద్రీకరించిన జిల్లా కేంద్రానికి చెందిన పులిప్పారి రాజబాబు రెండో కుమారుడు రాహుల్ అందరికీ ఆదర్శప్రాయుడుగా నిలిచాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు సాధించగా, తాజాగా గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాలలో వార్డ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని పొందాడు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని గ్రంథాలయ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న అవసరాలకు అనుగుణంగా పుస్తకాలను మార్చాలన్నారు. పుస్తక పఠనం వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్స్ సదానందం, కె.ప్రవీణ, ఎం స్వర్ణలత, జి సతీదేవి, ఎం వెంకటరమణ, స్వీపర్ సలీం, రామయ్య, గోపి పాల్గొన్నారు.

గ్రూప్-4కు ఎంపికైన మండల వాసులు

నవతెలంగాణ-జన్నారం

గురువారం సాయంత్రం విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో మండలానికి చెందిన 7గురు ఉద్యోగాలు సాధించారు. మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన ఎలగందుల మధుకర్, పొనకల్ గ్రామానికి చెందిన నగూరు అనిల్ కుమార్, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కూకటికారి దుర్గాప్రసాద్, హాస్టల్ తండా కు చెందిన లకావత్ రాజు, దేవునిగూడ గ్రామనికి చెందిన సింగిరెడ్డి రణదీప్‌రెడ్డిలు మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన జాడీ రాజా తిరుపతి, గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నూతన అటవీ చట్టం రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న అటవీ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బీర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అడవిలో ఆదివాసులకు హక్కులు కల్పించాలని, స్వాతంత్రం కల్పించాలని పోరాటం నిర్వహించిన మహనీయుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఆయన పోరాటాల ఫలితంగానే నేడు ఆదివాసులకు అడవిపైన అనేక హక్కులు వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బీర్సా ముండా ఆశయానికి వ్యతిరేకంగా షెడ్యూల్ ప్రాంతాలను ఎత్తివేస్తూ అడవులను కార్పోరేట్లకి అప్పజెప్పు గిరిజన హక్కులను కాలరాస్తుందన్నారు. నూతన అటవి చట్టాన్ని తీసుకువచ్చి దానికి అనుగుణంగా ఝార్ఖండ్ ప్రాంతంలోని అనేక అడవులను జిందాల్ కంపెనీకి అప్పజెప్పి గిరిజనులను నిర్వాసితులను చేస్తుందన్నారు. మధ్యప్రదేశ్ లో 5000 ఏకరాల అడవిని ఆదాని కంపెనీకి ఇచ్చిందన్నారు. ఇది పూర్తిగా షెడ్యూల్ ప్రాంతాల హక్కులను, పెసా, గ్రామ సభలను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. జన్ జాతి గౌరవ దివస్ పేరుతో ఆదివాసీల పట్ల ముసలి కన్నీరు కారుస్తూ పూర్తిగా ఆదివాసి వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని మండిపడ్డారు. నూతన అడవి చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొరెంగ మాలశ్రీ, నేర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, దిగడ బక్కన్న, నైతం రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జే రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశాన రాజన్న పాల్గొన్నారు.

బీర్సా ముండా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బిర్సా ముండా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో బిర్సాముండా 150వ జయంతి పురస్కరించుకొని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో గిరిజన గౌరవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవల్, ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి మొదట జ్యోతి ప్రజ్వలన చేసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. బీహార్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయులను స్మరించుకోవాలని గుర్తు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం ఈ ప్రాంతంలో కుమురంభీం పోరాట స్ఫూర్తి ఉందన్నారు. గిరిజనుల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గుస్సాడి కళను ప్రపంచానికి చాటిన పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వర్గీయులు కనకరాజును కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంప్రదాయాలు గుర్తుండి పోయేలా కనకరాజు కృషి ఉందని గుర్తుచేశారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు సౌకర్యం కల్పించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపారు. గిరిజన సాధికారత వికాసిత భారత్‌లో భాగంగా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో గిరిజన సంక్షేమం కోసం సంకల్పంతో ఆచరణ దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, అంగన్‌వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో ఎంపీఓ సుధాకర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ఆసిఫ్ అలీ, మొన్నేవార్, కోలవర్ ఆదివాసుల నాయకుల ధ్వర్యంలో బిర్సాముండా 150వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. జయంతి సందర్భంగా ప్రజలందరికీ జన జాతీయ గౌరవ దివాస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. నాటిన మొక్కలను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు.

వాంకిడి : భగవాన్ భీర్సాముండా 150వ జయంతి సందర్భంగా గిరిజన సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ జన జాతీయ గౌరవ్ దివస్‌గా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో పేసా గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని పాటగూడ, చౌపన్‌గూడ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి ప్రవీన్‌కుమార్ పాల్గొని పేసా చట్టం, ఫారెస్ట్ రైట్‌యాక్ట్ (ఎఫ్ఆర్ఏ)లపై గిరిజనులకు వివరించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్(జీపీడీపీ), గ్రామ అభివృద్ధి సూచికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లో గిరిజన యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణం కోసం పాటుపడాలని యువతకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సంగీత, నియమాళిక, గ్రామస్తులు పాల్గొన్నారు.



గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం ముచ్చగిరి నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగులు నిత్యం విధులకు హాజరైతే సంస్థతో పాటు వారి కుటుంబానికి ప్రయోజనమన్నారు. ఆరోగ్య సమస్యలుంటే ఆస్పత్రికి వెళ్లి వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకునేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో విడివిడిగా మాట్లాడారు. గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శేషశయనరావు, డీజీఎంఐఈడీఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ ఎం శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాంకిడి ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటన బాధాకరమని అయితే దీనికి ప్రధానోపాధ్యాయున్ని బాధ్యునిగా చేయడం సరైన విధానం కాదన్నారు. గతంలో ఇదే ప్రధానోపాధ్యాయుని పనితీరుపై ప్రశంసలు కురిపించడంతోపాటు అవార్డులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పాఠశాలల పనితీరు మెరుపరచాల్సిన ప్రధానోపాధ్యాయులపై హాస్టల్ భారం మోపడంతో అదనపు భారం పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో భోజన వ్యవస్థను క్యాటరింగ్ విధానానికి అప్పగించాలన్నారు. సస్పెండ్ చేసిన ప్రధానోపాధ్యాయుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వసతులు లేని వసతులు ఉన్న పాఠశాలలను గుర్తించి విద్యార్థులను సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఉద్ధవ్, జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ప్రసాద్, కోశాధికారి రవీందర్ పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి దిశగా

- ధర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్ పథకం అమలు
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి దిశగా ప్రధానమంత్రి ధర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని పీఎం నరేంద్ర మోడీ లైవ్ టెలికాస్ట్ విధానం ద్వారా ప్రారంభించారని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, నోడల్ అధికారి వి.సీతారాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ధర్తీ ఆబా జనజాతీయ ఉత్కర్ష్ అభియాన్ నూతన పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధిని కాంక్షిస్తూ వారికి మౌలిక వసతులు కల్పించేందుకు, గిరిజన నివాస ప్రాంతాలలో గిరిజనులకు నీళ్లు, ఆరోగ్యం, టెలికాం, విద్యుత్, గృహ నిర్మాణం వంటి కనీస సౌకర్యాల కల్పన కొరకు పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అత్యంత మారుమూల, సేవలు దరిచేరని గిరిజన ప్రాంతాలకు కీలక సేవలను విస్తరించడం, ప్రభుత్వ ప్రయత్నాలను ఏకీకృతం చేసి అడ్డంకులను అధిగమించడంతోపాటు ప్రభావవంతమైన మార్పు కోసం ఏకీకరణను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన సాధికారత, వికసిత భారత్‌లో భాగంగా 20లక్షల పక్కా గృహాలు, 2.35 లక్షల కుటుంబాలకు సౌర విద్యుత్, వేయి సంచార మెడికల్ యూనిట్లు, 2లక్షల లబ్ధిదారులను ఎఫ్ఆర్ఏ పట్టాదారుల స్థిర వ్యవసాయం దిశగా ప్రోత్సహించడం, వేయి గిరిజన గృహ నివాసితులకు స్వదేశీ దర్శన్, 25 వేల కిలోమీటర్ల పొడవైన రహదారులు, ఎఫ్ఆర్ఏ, జాతీయ సికిల్ సెల్ మిషన్, అంగన్వాడి సేవలు, మత్స్య సంపద యోజన, జల్ జీవన్ మిషన్, జన ఆరోగ్య యోజన, సమగ్ర శిక్ష అభియాన్, టెలికాం సాంకేతిక అభివృద్ధి నిధి, నైపుణ్య భారత మిషన్ ఇతర అనేక పథకాల ద్వారా దేశాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ముందుగా బీర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎటిడిఓ పురుషోత్తం, ఎసిఎంఓ రాజమౌళి, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూఓ ఉపాధ్యాయులు, గిరిజన నాయకులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా ఉండేది క్రీడా ప్రాంగణమే



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కుల మతాలకు అతీతంగా ఉండేది ఒక క్రీడా ప్రాంగణమేనని, మైదానంలో అన్ని మరిచి గెలుపుకు పోరాడుతారని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రామ కల్యాణి అన్నారు. శుక్రవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల/కళాశాల గ్రౌండ్‌లో జూనియర్ బాలికల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. మరు భూమిని కూడా నేడు కుల మత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్న తరుణంలో క్రీడాప్రాంగణాలు మాత్రమే ఒక్కటిగా ఉన్నాయన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో ప్రాబబుల్స్‌లో 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసి 19 నుంచి 28 వరకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును 28న ప్రకటిస్తామని తెలిపారు. 29 నుంచి డిసెంబర్ 1 వరకు నిజామాబాద్ జిల్లా ఆలూరు మండలం కల్లడి గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు మమత, రాజేష్, విశాల, దీపిక, కోచ్ అరవింద్, సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయాలు గురువారం కార్తీక శోభను సంతరించుకున్నాయి. ఉదయం నుండే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో గల శివాలయంతో పాటు పెద్ద వాగు ఒడ్డున గల బాలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఆలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసినప్రత్యేక దీపారాధన భక్తులను ఆకట్టుకుంది.

కార్తీక వన భోజనం

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఉసిరికాయ చెట్టు కింద వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకుడు రవికిషోర్ జోషి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | నవంబర్ 16, 2024 | www.navatelangana.com

గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికైన తేజ కళ్యాణి

నవతెలంగాణ-లక్సెట్టిపేట



పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన కూడేల్లి తేజకళ్యాణి గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికైంది. 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు పట్టణంలో చదివింది. 9,10 కాగజ్‌గర్ నవోదయలో, ఇంటర్ టిఎస్ఆర్జేసీ హసన్‌పర్తి, డిగ్రీ కోఠి ఉమెన్స్ కాలేజీ, పీజీ తార్నాకలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ లో విద్యాభ్యాసం చేశారు. గురువారం రిలీజ్ అయిన గ్రూప్-4లో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయింది. ఆమెను కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

మోసపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని హాస్టల్ తండా, కొత్తగూడా గ్రామాలకు చెందిన గిరిజన రైతులు, ఓ కంపెనీకి చెందిన నకిలీ వరి విత్తనాలు వేసి మోసపోయారని వారిని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండగుర్ల లింగన్న అన్నారు. శుక్రవారం ఆ గ్రామాలలో వరి పొలాలను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. నకిలీ విత్తనాలు ఇచ్చిన ఆ ఫర్టిలైజర్ దుకాణాలపై, కంపెనీలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అంబటి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుని మృతి



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొమ్మిడి అరుణ్ కుమార్(26) యువకుడు కారు ఢీకొని చనిపోయినట్టు ఎస్ఐ పి సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం 5 గంటలకు వాకింగ్ కోసం తన గ్రామానికి చెందిన స్నేహితులు రేగుంట దినాకర్, బొప్పు విష్ణు, రేగుంట మహేష్‌లతో కలిసి కొత్తూరు స్టేజి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అరుణ్‌ని, రేగుంట మహేష్‌ని వెనక నుంచి కారు ఢీ కొట్టింది. జన్నారం వైపు నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ అరుణ్ కుమార్ ఢీకొట్టడంతో తలకు గాయమై, కాలు విరిగి అక్కడికక్కడే చనిపోయాడు. మహేష్‌కు గాయాలయ్యాయి. మృతునిని తల్లి బొమ్మిడి మంజులత పిర్యాదు చేయగా డ్రైవర్ మహ్మద్ సలామోద్దీన్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మతుని నేత్రాలను కుటుంబసభ్యులు ఐ బ్యాంక్ కు డోనేట్ చేశారు.

నాయకుడిగా కాదు..సేవకుడిగా మీ ముందుకు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లి గ్రామంలోని ఇప్పలపల్లి రోడ్‌కు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బంది పడడం గమనించి తన సొంత ఖర్చులతో మొరం పోయించి గుంతలను పూడ్చినట్టు ఆ గ్రామానికి చెందిన నాయకుడు ఇప్ప రాకేష్ తెలిపారు. అంతేకాకుండా గత అయిదు సంవత్సరాలలో తాజా మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ సహాయంతో ఊరిలో అనేక సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఊరిలో ఎవరు చనిపోయిన చితిమంటల కోసం తన సొంత ఖర్చులతో ట్రాక్టర్‌లో కట్టేలు ఇస్తానని తెలిపారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైన గురుకుల విద్యార్థినులు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని జడ్పీహెచ్ఎస్ రెబ్బెనపల్లి పాఠశాల ఆవరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14 బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించగా నాలుగు జిల్లాల నుంచి 48 మంది క్రీడాకారిణిలు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. సిద్దిపేట జిల్లా చేగుంట గ్రామంలో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల వాలీబాల్ ఛాంపియన్షిప్‌లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టులో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల లక్సెట్టిపేట నుంచి ఏ.శాలిని 8 తరగతి, హరిప్రియ, భవితలు పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కే రమా కళ్యాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్ కె మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కె శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు మమతా రమాదేవి అభినందించారు.

ఘనంగా బీర్సాముండ జయంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీలో ఆదివాసీ స్వతంత్ర సమరయోధుడు భీర్సాముండా 150వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పెసా గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, పంచాయతీ కార్యదర్శి నరేశ్, గ్రామ పటేల్ చిక్రం భీము, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవాపూర్ లో..

మండలంలోని దేవాపూర్‌లో భగవాన్ భీర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, నాయకులు కొమ్ముల బాపు, మడావి వెంకటేష్, సిడం రాందాస్, సంద్ర భూమయ్య ఆత్రం జంగు, సిడం కేశవరావు, కనక గోవర్ధన్, మడావి ధర్మారావు, కనక రాజు, మహేష్ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం జన జాతీయ గౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఆ గ్రామసభలో భగవాన్ భీర్సాముండా 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామ ప్రజలకు పెసా చట్టం ప్రకారం గ్రామ సభ హక్కులు, అధికారాలు, విధులు అటవీ హక్కుల చట్టం అటవీ పరిరక్షణ నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సభలో భాగంగా స్వచ్ఛమైన భారతదేశం కోసం మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జి. జలందర్ , పంచాయతి కార్యదర్శి చంద్రమౌళి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాండూర్ : భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కొత్తపల్లి గ్రామ పంచాయతీ లోని పెగడపల్లి ఆవాసంలో జన జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా పెసా చట్టం ప్రకారం గ్రామ సభ హక్కులు, అధికారాలు విధులు తెలియపరిచారు. అటవీ హక్కు చట్టం అటవీ పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సభలో భాగంగా స్వచ్ఛమైన భారతదేశం కోసం, మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జి అనీల్ కుమార్, ఇన్‌చార్జి పంచాయతి కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 26 ఏండ్ల బొమ్మిడి అరుణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి బంధువుల కోరిక మేరకు నేత్రదానానికి ముందుకు రాగా లైన్స్ క్లబ్ మంచిర్యాల, గోల్డెన్ జూబ్లీ వారి ఆధ్వర్యంలో లయన్ డాక్టర్ అభిషేక్ సహకారంతో నేత్రాలలోని కార్నియాను సేకరించి హైదరాబాదులోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్మన్ వి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్ర దానం అతి ముఖ్యమైనదని, ఒక మనిషి నేత్రాల ద్వారా ఇద్దరు మనుషులకు చూపును ప్రసాదించే అవకాశం కలుగుతుందని మరణానంతరం ఆరు గంటల లోపు నేత్రదానానికి ముందుకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ నేత్రదానానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ప్రెసిడెంట్ లయన్ రాకేష్ రెడ్డి, లైన్స్ ఇంటర్నేషనల్ మైక్రో క్యాబినెట్ మెంబర్స్ ఇరుకుల ఆనంద్, డాక్టర్ కె సుగుణాకర్‌రెడ్డి, లయన్ వీ. మధుసూదన్‌రెడ్డి , లయన్ ఎం.రామాంజనేయులు, లయన్ దేగ బాబు, లయన్ ఇరుకుల శివప్రసాద్, లయన్ చందూరి మహేందర్ పాల్గొన్నారు.

ఆరెపల్లి మద్దికల్ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రం నుంచి ఆరెపల్లి, మద్దికల్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆయా గ్రామాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సిఫారస్ లేటర్‌తో శుక్రవారం ఈ మేరకు మంచిర్యాల ఆర్టీసీ మేనేజర్‌ను కలిశారు. భీమారం-కొత్తపల్లి నుంచి చెన్నూర్ మండలం ఆస్నాద్ ఎక్స్‌రోడ్డు, అంగరాజ్‌పల్లి కత్తరసాల మీదుగా చెన్నూర్ వరకు ఆర్టీసీ బస్సు నడపడం ద్వార సుమారుగా 12 గ్రామాల వారికి ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. చెన్నూర్, మంచిర్యాల పట్టణాలకు ప్రయాణించాల్సిన పరిస్థితుల్లో ఆయా గ్రామాలకు చెందిన వారు విధిగా భీమారం వరకు ఆటోలలో ప్రయాణించాల్సివస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రయాణ భారం తగ్గడంతో పాటు ఖర్చులు ఆదా చేసుకున్నట్లు అవుతుందని తెలిపారు. డిపో మేనేజర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు చిలకాని కనకయ్య, అన్నముల ఆశోక్, మంచాల మధూకర్, ఈదునూరి సంతోష్, బోయిరి లక్ష్మణ్ ఉన్నారు.

27న సీఎంపీఎఫ్ ట్రస్టు బోర్డు సమావేశం

నవతెలంగాణ-జైపూర్

కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశం ఈ నెల 27న ఢీల్లీలో సమావేశం కానుంది. బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశంలో ఆయన మొదటి సారి పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కోల్ ఇండియా చైర్మన్ కూడా హాజరు కానున్నట్లు తెలుస్తుండగా పెన్షన్ ఫండ్ పటిష్టతపై సబ్ కమిటీ చేసిన సిఫారస్‌కు ఆమోదం లభించే అవకాశం కన్పిస్తోంది. ఈ ఏడాది జూన్ 24న బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ పెన్షన్ ఫండ్ బలోపేతం కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేసినది విధితమే. కాగా ఈ సంబ్ కమిటీ మొదటి సారి జూన్ 1న కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్, కోల్ ఇండియా (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) డైరెక్టర్, ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ అదనపు కార్యదర్శి, సింగరేణి జనరల్ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)తో పాటు ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో సబ్ కమిటీలో చేర్చే ప్రతిపాదనలతో సమావేశం ముగిసింది. సబ్ కమిటీలో ఏఐటీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ యూనియన్ ప్రతినిదులకు సబ్ కమిటీలో అవకాశం కల్పించింది. సబ్ కమిటీ సమావేశం సెప్టెంబర్ 30న ఢిల్లీలో నిర్వహించగా బీఎంఎస్ యూనియన్ నాయకులు ఈ సమావేశాన్ని బహిష్కరించారు. కాగా విశ్రాంత బొగ్గు కార్మికులకు సజావుగా పింఛన్ అందించే బాధ్యత కోల్ ఇండియాపై ఉందని, కోల్ ఇండియా వారు పెన్షన్ ఫండ్‌కు ఏక మొత్తంలో నిధులు జమ చేయాలని, బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశంకు కోలిండియా చైర్మన్‌ను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు. కాగా ఈ సమాశానికి కోల్ ఇండియా చైర్మన్ హాజరు కావడంతో పాటు పెన్షన్ ఫండ్ బలోపేతానికి కృషి చేస్తారని బొగ్గు విశ్రాంత కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా గతంలో నిర్వహించిన సమావేశాన్ని బీఎంఎస్ ప్రతినిధులు బహిష్కరించగా ఈ నెల 27న జరిగే సమావేశానికి బీఎంఎస్ ప్రతినిధులు హాజరవుతారా..? అనేది వేచి చూడాలి.

పోడుపట్టాలన్నీ వెంటనే రద్దు చేయాలి



నవతెలంగాణ-తాండూర్

అనర్హులైన గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వడం సరికాదని, వెంటనే ఈ అక్రమాలపై విచారణ చేపట్టి పట్టాలను రద్దు చేయాలని కోలావార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పెట్టిన అధికారులు గిరిజనులు కాని వారిని అర్హులుగా ఎలా గుర్తించారో చెప్పాలన్నారు. గిరిజనేతరులను గిరిజనులుగా చూపిస్తూ ఈ అక్రమాలకు పాల్పడిన అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించి, గిరిజనేతరుల హక్కు పత్రాలను రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, మాజీ సర్పంచ్ మణికుమార్, తుడుడందెబ్బ మండల ఉపాధ్యక్షుడు ఊరడి మహేష్, నాయకులు చిలుకయ్య, చిన్నయ్య, ప్రవీణ్, హనుమంతు, రాజయ్య పాల్గొన్నారు.

రూ.15లక్షలతో గోదావరి రోడ్డు నిర్మాణం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వేలాల గ్రామంలో రూ. 15 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో గోదావరి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్ తెలిపారు. మంచిర్యాల-శివ్వారం ఆర్ అండ్ బీ రోడ్డు మల్లిఖార్జున స్వామి ఆలయం వెనుక నుంచి గోదావరి నది వరకు 24 ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 40 లక్షలు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంజూరు చేసినట్లు తెలిపారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వ్రతమాచరించిన ఎమ్మెల్యే దంపతులు
- ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్

నవతెలంగాణ-దండేపల్లి

తెలుగు రాష్ట్రాల్లో రెండవ అన్నవరంగా పేరుగాంచిన గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి జాతర వేలాది భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవస్థాన ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండే వేలాదిగా తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, దీపారాధనలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గూడెం సత్యనారాయణ స్వామి, అయ్యప్ప, సాయిబాబా ఆలయాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో గుట్టకింద నుంచి పైకి వెళ్లడానికి సౌకర్యాలు కల్పించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డిసిసి అధ్యక్షురాలు సురేఖ స్వామివారిని దర్శించుకుని సామూహిక వ్రతం ఆచరించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ దంపతులు వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా భారీకేడ్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజమౌళి, ఆలయ ఈఓ శ్రీనివాస్, జాతర ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తుల తాకిడి వేలల్లో ఉండడంతో స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా వేదపండితులతో ఆలయాల వద్ద నిత్యాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమయజ్ఞాలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, పుష్పలంకరణ, మహాహారతి, మంత్రపుష్పం, కుంకుమ యజ్ఞాలు వేద పండితులు, అర్చకులు మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుండి పది గంటల వరకు భక్తుల సంఖ్య వేలల్లో ఉండగా, మధ్యాహ్నం 2 గంటల వరకు గూడెం గుట్ట ప్రాంత మంతా జనసంద్రంగా మారింది. సుమారు 1500 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గూడెం దేవస్థాన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దండేపల్లి, లక్సెట్టిపేట సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు వాలంటీర్లుగా సేవలు అందించారు. దండేపల్లి మండల ఆర్ఎంపి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ లక్సెట్టిపేట సిఐ అల్లం నరేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. బందోబస్తులో దండేపల్లి లక్సెట్టిపెట్, జన్నారం, ఎస్ఐ ఉదయ్ కిరణ్, సతీష్, హర్షవర్ధన్‌తో పాటు ఐదుగురు సిఐలు, పది మంది ఎస్ఐల ఆధ్వర్యంలో సుమారు వంద మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





మందపల్లి రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

జన్నారం : మండలంలోని మందపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ముందుగా గ్రామస్థులు పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకొని, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పూజారులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో లలితసహస్రనామ పారాయణం చేశారు. అలాగే మండలంలోని తపాలపురం గ్రామంలో ఉన్న శివాలయం రాంపూర్ గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, పొన్కల్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో, కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.

సింగరేణి కల్చరల్ మీట్‌లో ఎస్టీపీపీ కళాకారుల ప్రతిభ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి వ్యాప్తంగా కంపెనీ లెవల్ కల్చరల్ మీట్-2024లో జైపూర్ ఎస్టీపీపీ కళాకారులు అత్యంత ప్రతిభను కనబర్చారు. కొత్తగూడెం ఏరియాలో శుక్రవారం నిర్వహించిన కల్చరల్ మీట్‌లో ఎస్టీపీపీ ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ రవీంద్ర కుమార్ స్వామి వేణు గానంలో మొదటి స్థానంలో నిలిచారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ శ్రీనిధి కర్ణాటక సంగీతంలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరు కళాకారులు ఎస్టీపీపీ నుంచి కంపెనీ లెవల్‌లో మొదటి స్థానంలో నిలిచి కొత్త గూడెం ఏరియా జీఎం పాలెం రాజు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావు ఈ ఇద్దరు కళాకారులను ఫోన్ ద్వార అభినందించారు. అంతే కాకుండా కోలిండియా పరిధిలో నిర్వహించబోవు పోటీలకు ఎన్నికైన వీరు అక్కడ కూడా సింగరేణి సంస్థను మొదటి స్థానంలో నిలుపాలని ఆకాంక్షించారు. కాగా కంపెనీ లెవల్‌లో నిర్వహించిన కల్చరల్ మీట్‌లో ప్రథమ స్థానంలో నిలుపడం ఎస్టీపీపీకి గర్వకారణమని అన్నారు.

సర్వేలో ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

సర్వేలో ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలని టీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణలో ఉపాధ్యాయులకు ఉదయం పూట నిర్వహణకు అవకాశం కల్పించి, మధ్యాహ్నం పాఠశాలకు హాజరయ్యే విధంగా అవకాశం కల్పించాలన్నారు. వ్యవసాయ పనుల కారణంగా రైతులు వెళ్లడంతో ఇంటివద్ద ఎవరు అందుబాటులో ఉండకపోవడంతో సర్వే సిబ్బందికి చాలా ఇబ్బందులు కలుగుతుందని, సర్వే పనులు సకాలంలో కావడానికి అంతరాయంగా మారిందనీ ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించి మధ్యాహ్నం వరకు పాఠశాలలు నిర్వహించేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ నాయకులు పవన్‌లాల్ జాదవ్, ఉత్తం జాదవ్ పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణంలోని టౌన్-3 ఏరియాలో మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దివ్యనగర్, అయ్యప్ప టెంపుల్, దత్తాత్రేయనగర్, ఏఎన్‌రెడ్డి కాలనీ, శాస్త్రినగర్ కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల చేపడుతున్నందున శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని ఖానాపూర్, సోనార్‌గల్లీ, బొక్కలగూడ, కొలీపురా, మసూద్ చౌక్, ధన్‌గర్‌గల్లీ, శాంతినగర్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

ఉద్యోగ సమస్యలపై సబ్ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని టీఎన్జీఓ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన పట్టణంలోని టీఎన్జీవోస్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సబ్ కమిటీలో ముఖ్యంగా జేఏసీ డిమాండ్లపై చర్చించడం జరుగుతుందన్నారు. జీఓఎంఎస్ నెంబరు 1481 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి జేఏసీ డిమాండ్లకు చర్చించడానికి కమిటీ వేయడం చాలా హర్షనీయమన్నారు. సబ్ కమిటీ అతి త్వరలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉప సంఘం మరి చొరవ తీసుకుంటుందని పేర్కొన్నారు. వికారాబాద్‌లో అధికారులపై దాడి జరగడం అమానుషమన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు అన్ని జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పెన్షన్స్ అందరూ మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నైతిక ప్రభుత్వం స్థైర్యం దెబ్బతినకుండా గట్టి చర్యలు తీసుకోవాలని దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ సంద అశోక్ కుమార్, కార్యదర్శి నవీన్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్, అమరేందర్, తిరుమలరెడ్డి, అరుణ్ కుమార్, రాజేశ్వర్, గోపి, కొండూరు గంగాధర్, శివకుమార్, శ్యామ్ నాయక్, సప్తర్ అలీ పాల్గొన్నారు.

ముత్నూర్‌లో బ్యాంకు ఏర్పాటును అడ్డుకుంటే ఖబడ్దార్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ గ్రామంలో మంజూరైన తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయనియకుండా కొందరు తమ స్వలాభం కోసం కుట్ర చేస్తున్నట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రముఖ దినపత్రిక విలేఖరితో పాటు కొందరు గిట్టని వారు తమ భవనంలో బ్యాంకును ఏర్పాటు చేయాలంటే మరొకరు తమ భవనంలో ఏర్పాటు చేయాలని అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఏర్పాటుకు అడ్డుపడితే సహించేది లేదని గ్రామస్తులు పటేల్ హెచ్‌కే.జంగు, కేస్లాపూర్ పటేల్ వెంకట్ రావ్, సీడం భీంరావ్‌తో పాటు మాజీ సర్పంచ్ మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముత్నూర్ గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ముత్నూర్ బ్యాంకు ఏర్పాటు కోసం ఆ బ్యాంకు చైర్మెన్ సీతారాణికి గ్రామస్తులు విన్నవించగా బ్యాంకు ఏర్పాటు కోసం ఏర్పాట్లు చకచకగా కొనసాగుతున్నాయన్నారు. ఈనెల 20న ప్రారంభించాల్సిన బ్యాంకును కొందరు గిట్టని వారు కుట్ర పూరితంగా అడ్డుకోవడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఆదివాసీ నాయకులను సముదాయించారు. దీనితో శాంతించిన ఆదివాసులు నిరసనను విరమింపజేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాగోని సుధాకర్‌గౌడ్, భీమనవేణి రాములు యాదవ్, భీమనవేణి రవి యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్, అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని కోలాంగూడ, కొత్తూర్, సొసైటీగూడ గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీకి క్యాడర్ ఎంతో ముఖ్యమైందని అది కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ నాయకుడిపై ఉంటుందన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో నాయకుల కృషి వల్ల పార్టీ బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, యెల్మెల్వార్ రామ్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్, నాయకులు అల్చెట్టి నాగన్న, బూర్ల శంకరయ్య, కిజర్ పాషా, చిలుకూరి సతీష్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి మాజీ ఉపసర్పంచ్ సేవలు

నవతెలంగాణ-సిరికొండ

మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మండలంలోని ఫకీర్ నాయక్ తండ గ్రామ శివారులో తిరుగుతున్నాడు. గమనించిన ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ సంజీవ్ ఆ మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి సపర్యలు చేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. చిరిగిన బట్టలతో, గడ్డంతో తిరుగుతున్న అతడికి తనే స్వయంగా గడ్డం గీసి, స్నానం చేయించి, నూతన దుస్తులను తొడిగి, కడుపు నిండా భోజనం పెట్టాడు. కన్న తల్లి తండ్రులను పట్టించుకోని నేటి సమాజంలో ముక్కు ముఖం తెలియని వ్యక్తికి సపర్యలు చేసి, కడుపు నిండా భోజనం పెట్టిన మాజీ ఉప సర్పంచ్ సంజీవ్‌ను మండల వాసులు అభినందించారు.

రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ కొంటాం

- రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-భైంసా

ఇందిరమ్మ రాజ్యంలో రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసాలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు, ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. రైతుల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ఈ విషయమై వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడటం జరిగిందన్నారు. అదేవిధంగా ధరణి పేరుతో జిల్లాలో వక్ఫ్ బోర్డు, దేవాదాయశాఖ, ప్రభుత్వ సంస్థ భూములను గత పాలకులు అక్రమించారని, ఈ విషయంపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించామన్నారు. పది సంవత్సరాల కాలంలో పేదవాడికి ఒక్క ఇల్లు నిర్మించి ఇవ్వలేదని, గతంలో పెండింగ్‌లో ఉన్న నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రైతుల ముసుగులో అధికారులపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు కార్యకర్తలతో మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంపై సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్ వర్గీయులతో వేరువేరుగా సమావేశమయ్యారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్, అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్ పీఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పీఎమ్మార్సీ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని విన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పీఎం జన్‌మన్ పథకంలో మంజురైన రోడ్లు ఫారెస్ట్ యాక్ట్‌ల కారణంగా రద్దు అయ్యాయని పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అడవి ప్రాంతంలోని గ్రామాలకు మౌలిక సదుపాయాలు అందాలంటే కొంతమేర ఫారెస్ట్ యాక్ట్‌లను సడలించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసుల హక్కులకై నిరంతర పోరాడిన భగవాన్ వీర్ బీర్సాముండా పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాంజీ గోండు, కుమురంభీం పోరాటం సైతం స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం మహిళలకు చెక్కులను, కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏపీఓ వసంతరావు, పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్, అదనపు డీఎంఎచ్‌ఓ మనోహర్, సార్మెడీ దుర్గు పటేల్, నాగ భూషణ్, అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను సంరక్షించాలి

- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత



నవతెలంగాణ-నిర్మల్

భూగర్భ జలాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత తెలిపారు. నారీ శక్తిసే జల్ శక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాలో సాంకేతిక అధికారి సుశాంత్ కుమార్‌తో కలిసి పర్యటించారు. భూగర్భ జలాల సంరక్షణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. లక్ష్మణచాంద మండలం చామన్‌పల్లి, పొట్టపల్లి గ్రామాలలో పర్యటించి, నీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించి, నీటి సంరక్షణకు చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో జిల్లా మెరుగైన స్థానంలో ఉండటం గొప్ప విషయం అని కొనియాడారు. అనంతరం జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రత్యేకమైన కొయ్య బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించి హస్తకళలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓలు, ఏపీఎంలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల శంకర్ బరోసానిచ్చారు. శుక్రవారం జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో జర్నలిస్టులతో కలిసి పట్టణంలోని దుబ్బగూడ, కుమురంభీం కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను పరిశీలించారు. గత పాలకులు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వక పోవడం దురదృష్టకరమని, తాను అసెంబ్లీకి వెళ్లిన వెంటనే తొలిసారిగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయం మాట్లాడిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తప్పనిసరిగా నివాస స్థలాలు ఇవ్వాలని, ఇందుకోసం తాను ముందుండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట మావల తహసీల్దార్ వేణుగోపాల్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సర్వేయర్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం : కలెక్టర్

ఎమ్మెల్యే పాయల శంకర్, జర్నలిస్టులతో కలిసి సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాజర్షిషాను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జర్నలిస్టుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులతో కలిసి ఉదయం పరిశీలించిన ప్రభుత్వ స్థలాల గురించి వివరించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం సముచితంగా ఉందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ భూములను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తానని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దేవేందర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు ఉన్నారు.



వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే అందోళన

- ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



నవతెలంగాణ-భైంసా

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని, అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని ఆపకుండా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ హెచ్చరించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికంటే ముందుగా అబ్దుల్లాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే, రైతులను ఇబ్బంది పెట్టడం ఏంటన్నారు. రైతులంతా కలిసి రాస్తారోకో చేయాల్సి వచ్చిందంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోత పేరుతో రైస్ మిల్లర్లు, అధికారులు వేధిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలను చేపడతామన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ రైతుని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.. ఇకనైనా తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ధర్నాలు రాస్తారోకోలు చేయాల్సి వస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద వరి కొన్న వెంటనే ధాన్యాన్ని తరలించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. గతంలో చేసిన తప్పిదాలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, బాసర మాజీ ఎంపీపీ విశ్వనాథ్ పటేల్, బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి ఉన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అందరూ సహకరించాలని ఎంపీడీఓ జవహర్‌లాల్, సూపరింటెండెంట్ గంగాసింగ్ కోరారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ బలాన్‌పూర్ తదితర గ్రామాల్లో తిరుగుతూ ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, పూర్తి వివరాలు సేకరించాలని సర్వేకు అందరూ సహకరించాలన్నారు. వారి వెంట సర్వేలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, అవినాశ్, ఎన్యూమరేటర్లు, ఉపాధ్యాయులు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఘనంగా లహుజీ సాల్వే జయంతి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామంలో శుక్రవారం సాల్వే 231వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత జిల్లా నాయకులు మోటే రావ్ అనిల్, సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లహుజీ సాల్వే త్యాగాలను మర్చిపోవద్దని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు విలాస్, మనోహర్, రాహుల్ ఉన్నారు.

గ్రూప్-4 ఫలితాల్లో మెరిసిన అక్కాచెల్లెళ్లు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ ఫోర్త్ ఉద్యోగ ఫలితాలు గురువారం విడుదలచేసింది. మండలంలోని రైతు కుటుంబం నుంచి బస్సి రాము, బస్సి శ్యాంకుమార్‌కు చెందిన సొంత అన్నదమ్ముల పిల్లలు బీటెక్ వరకు చదివించారు. బస్సి ప్రీతి ప్రభుత్వంలో ఏప్రిల్‌లో విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఇటీవ శిక్షణ కూడ పూర్తి చేసుకుంది. గ్రూప్ ఫోర్త్ పరీక్ష ఫలితాల్లో రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి అర్హత సాధించడంతో కుటుంబ సభ్యులు హర్షం చేశారు. ఈ సందర్భంగా ఇరువురి అక్కచెల్లెలు మాట్లాడుతూ గ్రూప్ వన్ ఉద్యోగం సాధించడమే తమ ఉన్నత లక్ష్యమని పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి

నవతెలంగాణ-సారంగాపూర్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మే రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో పార్టీ మండల క్రియాశీల కార్యకర్తలతో వర్క్‌షాప్ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కరిపే విలాస్, సీనియర్ నాయకులు మంతెన గంగారెడ్డి, సిందికర్ శ్రావణ్, చెన్న రాజేశ్వర్, మన్నూరి నారాయణ, సాహెబ్‌రావు, సామల వీరయ్య, కోరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, బ్యాగరి ఎల్లన్న, కరుణసాగర్‌రెడ్డి, భూమారెడ్డి, జీకే చాణక్య, తిరుమల చారి, పోతన్న, రంజిత్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

గోపాలకృష్ణ మఠంలో దీపోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ గోపాలకృష్ణ మఠంలో శుక్రవారం ఉదయం దిపోత్సవ కార్యక్రమం, కాగడ హారతి నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్ సతీమణి ఉమాతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మఠంలో వందల సంవత్సరాల నుంచి కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవ పూజా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. హిందువులంతా ఏకతాటిపై ఉంటూ ధర్మాన్ని కాపాడుకుంటూ, ముందుకు సాగాలన్నారు. వీరితోపాటు బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, నిఖిల్ సాయి పాల్గొన్నారు.

గోదావరి నదిలో భక్తుల కార్తిక పౌర్ణమి పూజలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సోన్ గోదావరి నదిలో భక్తులు గంగాస్నానం ఆచరించి గోదావరి తల్లికి దీపారాధన చేశారు. నిర్మల్ జిల్లా నుండే కాకుండా నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు రావడంతో గోదావరి పరివాహక ప్రాంతం సందడిగా మారింది.

